

రాష్ట్రంలో తేలియాడే.. సోలార్ ప్లాంట్లు..!

● 40 చెరువుల్లో ఏర్పాటుకు ప్రభుత్వం యోచన ● చేపల పెంపకానికి వీలు
● వేసవిలో తగ్గనున్న నీటి నష్టాలు
● వనరులు సమకూర్చుకునేందుకు కొత్త విధానం


తేలియాడే సోలార్‌ప్లాంట్ నమూనా

బెంగళూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్పత్తి భారం అవుతోంది. థర్మల్‌పవర్‌కు అవసరమైనంత బొగ్గు సమకూర్చుకోవడం సవాల్ మారుతోంది. మరోవైపు జల విద్యుత్ ఉత్పత్తికి ఇటీవల రెండేళ్ల ఆశాజనకం అనిపించినా కరువు వస్తే ఉత్పత్తి స్తంభించనుంది. ఇక గాలిమరలు, సోలార్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను సమకూర్చుకునేందుకు కసరత్తు పెరుగుతోంది. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గాలిమరలు ఉన్నాయి. ఉత్తరకన్నడ జిల్లాలో అణువిద్యుత్ కేంద్రం ఉన్నా డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి లేదు. ఇలా విద్యుత్ ఉత్పత్తికి పలు అవకాశాలు ఉన్నా ఏటా విద్యుత్ వాడకం పెరిగిపోతోంది. జనజీవనానికి విద్యుత్ లేకుండా గంట గడిపే పరిస్థితి కూడాలేదు. వాతావరణంలో వచ్చిన మార్పుల ప్రభావంతో ఓవైపు వర్షం కురుస్తున్నా ఇంట్లో ఫ్యాన్ లేకుండా గడిపే పరిస్థితి లేదు. ఇలా విద్యుత్ మనిషి జీవనానికి పలు విధాలా అత్యవసరం అవుతోంది. మరోవైపు విద్యుత్ వాహనాలు మార్కెట్‌లోకి పెరుగుతున్నాయి. ఇలా ఏ కోణంలో చూసినా విద్యుత్ ఉత్పత్తిలో భారీగా మార్పులు రాకపోయినా వాడకంలో మాత్రం రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది.

● ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండే విశాలమైన చెరువులలో తేలియాడే సోలార్ ప్యానళ్లను అమర్చి సౌర విద్యుత్‌ను పెంచుకునేందుకు కేంద్రప్రభుత్వ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) రూపొందించిన కార్యాచరణ నివేదిక బలమిస్తోంది. ఆదాయంతోపాటు బహుళ ప్రయోజనాలకు చెరువులో సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటు అనుకూలంగా ఉందని ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు కంట్రాక్టు ఏ విధంగా ఇవ్వాలనే మార్గదర్శకాలను చిన్ననీటి పారుదల శాఖ సిద్ధం చేస్తోంది.

● నదుల నుంచి చెరువులు, కాలువలు, చెక్‌డ్యామ్‌లకు నీటిని నింపే ఎత్తిపోతల ప్రాజెక్టుకు 11కోట్ల రూపాయల దాకా విద్యుత్ బిల్లు వస్తోంది. నిర్వహణ వ్యయం చిన్ననీటిపారుల విభాగంపై పడుతోంది. సొంత ఆదాయాల మూలాల అన్వేషణ ప్రయత్నంగా చెరువులలో తేలియాడే సోలార్ ప్యానళ్లను అమర్చదలిచారు. ఇప్పటికే ఒడిశా, గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలలో అధ్యయనం చేసి కార్యాచరణ బాధ్యతను బీహెచ్‌ఈఎల్‌కు ఇవ్వదలిచారు. ఈ ప్రాజెక్టు ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నట్టు ప్రభుత్వానికి నివేదిక చేరింది. వివిధ చెరువులకు సంబంధించి 10వేల ఎకరాల విస్తీర్ణంలో సోలార్ ప్యానళ్లు అమర్చడం ద్వారా 2వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనా అంచనా వేశారు.

చెరువుల్లో సోలార్‌ప్లాంట్‌తో ఎన్నో ప్రయోజనాలు

చెరువులలో తేలియాడే సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నట్టు నిపుణులు గుర్తించారు. వేసవికాలంలో ఎండవేడిమి నుంచి నీటి ఆవిరిని కొంతమేర నియంత్రించనుంది. ఆక్రమణలు కాకుండా రక్షణ లభించనుంది. అలాగే చేపల పెంపకానికి అనుకూలం కానుంది. వీటన్నింటికంటే వ్యవసాయ భూములలో సోలార్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేయడం ద్వారా పంటల సాగు సాధ్యం కాదు. పైగా బంజరు, బీడుభూములైనా పశువుల మేతకు ఇబ్బంది కలగనుంది. వీటితోపాటు చెరువులలో సోలార్‌ప్లాంట్‌ల ద్వారా సంబంధిత గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయం సాధ్యం కానుంది. అందుకే చెరువులలో తేలియాడే సోలార్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేయదలిచారు. పీపీపీ పద్ధతిన ఏర్పాటుకు కసరత్తు జరుపుతున్నారు. బీహెచ్‌ఈఎల్ వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని నివేదిక ఇచ్చింది.

40 చెరువుల ఎంపిక

చెరువులలో సోలార్‌ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌లకు అనుసంధానం చేసేందుకు అవసరమైన సబ్‌స్టేషన్‌లు తదితర మౌలిక సదుపాయాలు సమకూర్చదలిచారు. తొలి విడతలో బెంగళూరు విభాగంలో చెరువులను ఎంపిక చేయదలిచారు. కోలారు, చిక్కబళ్ళాపుర, చిత్రదుర్గ, బెంగళూరు నగర, దక్షిణ, గ్రామీణ జిల్లాల పరిధిలో విశాలమైన 40 చెరువులను ప్రాజెక్టు తొలి విడతకు ఎంపిక చేయదలిచారు. కనీసం 50శాతం నీరు ఉండాల్సి ఉంటుంది. తొలి విడతలో హెచ్‌ఎన్ వ్యాలీ, కేసీ వ్యాలీ, కావేరి నది పరీవాహకంలో ఎత్తిపోతల ప్రాజెక్టుల పరిధిలోని చెరువులను ఎంపిక చేయదలిచారు.

సొంతంగా నిధులు సమకూర్చుకునే యోచన

నదీ మూలాలనుంచి నీటిని చెరువులు, కాలువలకు నింపే ఎత్తిపోతల ప్రాజెక్టులకు విద్యుత్, నిర్వహణకు ఏడాది నుంచి ఏడాదికి పెరుగుతోంది. ప్రస్తుతం నెలకు 11వేల కోట్ల రూపాయలు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ఈ భారాన్ని నిభాయించేందుకు చెరువుల నిర్వహణ, జలమూలాల అభివృద్ధి తదితర కార్యాచరణకు నిధుల కొరత ఏర్పడుతోంది. అందుకోసమే సొంతంగా వనరులను సమకూర్చుకునే మహత్తరమైన ఆలోచనగా సౌర విద్యుత్, చేపల పెంపకం వంటి విభాగాలకు చిన్ననీటిపారుదల ఎంపిక చేసింది. మార్గదర్శకాలు, నిబంధనలను సిద్ధం చేశాక తేలియాడే సోలార్‌ప్లాంట్ ప్యానళ్ల ఏర్పాటుకోసం టెండర్లు పిలవదలిచారు. కనీసం 100 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువులను ఈ ప్రాజెక్టుకు ఎంపిక చేయనున్నారు. గ్రిడ్‌కు విద్యుత్ అనుసంధానం చేసేందుకు మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని రానున్నరోజుల్లో ఎక్కువ చెరువులకు విస్తరించనున్నారు. రాష్ట్రంలోని తుమకూరు జిల్లా పావగడలో అతిపెద్ద సోలార్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. తద్వారా వేలాది ఎకరాలను సాగుకు దూరం చేసినట్టయ్యింది. చెరువులలో తేలియాడే సోలార్‌ప్లాంట్ తీసుకురావడం ద్వారా సాగుభూమికి ఎక్కడా సమస్య ఉండదు.

కబిని జలాశయానికి వాయనం సమర్పించిన సీఎం


వాయనం సమర్పిస్తున్న సీఎం, డీసీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు

బెంగళూరు, జూలై20(ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లా హెచ్‌డీ కోట తాలూకా బీచనహళ్ళి పరిధిలోని కబిని జలాశయానికి సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ ఆదివారం వాయనం సమర్పించారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రారంభమైన తొలిరోజుల్లోనే నిండే జలాశయంగా కబినికి పేరుంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 2284 అడుగులు కాగా 2283 అడుగులకు నీటిమట్టం చేరింది. జూన్ మొదటి వారానికే జలాశయం నిండింది. ఉదయం కబిని గోపురం వద్ద వాయనం సమర్పించిన ముఖ్యమంత్రి 32.25 కోట్ల రూపాయలతో ప్రాజెక్టు పునరుజ్జీవపనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ కావేరికి ఉపనది అయిన కపిల నదికి అనుబంధంగా జలాశయం ఉందన్నారు. 1.13 లక్షల హెక్టార్ల సాగుకు కబిని ప్రాజెక్టు ద్వారా సాధ్యమవుతోందన్నారు. ఈ జలాశయం ద్వారా రైతులకు మంచి జరగాలని కోరుకున్నట్టు తెలిపారు. మేకెదాటు ప్రాజెక్టుకు రాష్ట్రం కట్టుబడి ఉందని, కేంద్రం నుంచి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమాంతర జలాశయాలు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని, మహదాయికి అనుమతులు ఇప్పించడంలో బీజేపీ చొరవ చూపాలన్నారు. గోవాలో వారి ప్రభుత్వమే ఉందన్నారు. డీసీఎం మాట్లాడుతూ ప్రాజెక్టు పునరుజ్జీవపనులకు మలెమహదేశ్వర కొండపై జరిగిన కేబినెట్ భేటీలో 88 కోట్ల రూపాయలకు అనుమతులు ఇచ్చామన్నారు. జలలాశయాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మహదేవప్ప, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎల్‌సీలో తగ్గిన ఫలితాలు

● యాదగిరి జిల్లా ప్రధానోపాధ్యాయులకు నోటీసులు

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలలో వరుసగా ఐదేళ్లు చివరిస్థానంలో కొనసాగిన యాదగిరి జిల్లా పాఠశాలల హెడ్మాస్టర్‌లకు జిల్లా పంచాయతీ సీఈఓ శనివారం నోటీసులు జారీ చేశారు. రెండు విడతలలో నోటీసులు పంపారు. 40, 60శాతం తక్కువ ఫలితాలు వచ్చిన పాఠశాలలను ఎంపిక చేసుకుని నోటీసులు ఇచ్చారు. మీ పాఠశాలలో ఫలితాల శాతం తగ్గేందుకు కారణాలు ఏమిటని ప్రశ్నించారు. యాదగిరి జిల్లాలో పదోతరగతి ఫలితాలలో ఉత్తీర్ణశాతం తక్కువ వచ్చేందుకు కేవలం ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం లేదనేది సమాధానం కాదని, ఇతర కారణాలపై ఆరా తీయనున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చడం, అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు సమకూర్చడం కీలకం అవుతాయి. జిల్లాలో దాదాపు అన్ని హైస్కూళ్లకు తగినంతమంది ఉపాధ్యాయులను నియమించలేదు. ప్రతి పాఠశాలలోనూ ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. కొన్ని పాఠశాలల్లో సింగిల్ టీచర్ నడుపుతున్న పరిస్థితి ఉంది. ఇలా ఉంటే ఉత్తమ ఫలితాలు ఎలా సాధ్యమనే విమర్శలు ఉన్నాయి. గణితం, సామాన్యశాస్త్రం సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. వీటన్నింటినీ అధిగమించినా 15,086మంది పరీక్షలు రాయగా 7759మంది ఉత్తీర్ణులయ్యారు. హెడ్మాస్టర్‌లకు జారీ చేసిన నోటీసులలో ఉపాధ్యాయుల కొరతతోపాటు, ఉన్న ఉపాధ్యాయుల వివరాలను పొందుపరచాలని సూచించారు.

ఉప్పొంగిన భక్తి

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక పండుగను పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆడికృత్తిక అంటే మురుగన్ (సుబ్రమణ్య స్వామి)కి ఉపవాసంతో ఉండి పూజలు చేయడం సంప్రదాయం. సూర్యుడు దక్షిణ ముఖంగా ప్రయాణించే దక్షిణాయనం ప్రారంభానికి సూచికంగా ఆధ్యాత్మిక తకు అనుబంధం ఉంది. ఆషాఢమాసంలో కృత్తిక నక్షత్రం రోజున ఆడికృత్తికను ఆచరిస్తారు. ఇదో శుభ సందర్భంగా పూజలు చేస్తారు. సుబ్రమణ్యస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. పసుపు దుస్తులతో కావడిలు మోసి మొక్కులు తీర్చుకున్నారు.



కావడి మోస్తున్న పిల్లలు, పెద్దలు


హనుమంతనగరలోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం


పూజలు అందుకుంటున్న స్వామివారు

బల ప్రదర్శనకు వీరశైవ లింగాయత వర్గాలు

● నేటి నుంచి ప్రత్యేక సమావేశం


పీఠాధిపతులతో ఇన్‌చార్జి మంత్రి మల్లికార్జున

బెంగళూరు, జూలై 20(ఆంధ్ర జ్యోతి): వీరశైవ లింగాయత సామాజికవర్గం బల ప్రదర్శనకు పంచపీఠాలు సిద్ధమయ్యాయి. దావణగెరెలో సోమవారం నుంచి రెండురోజులపాటు వీరశైవ పీఠాల ప్రత్యేక సమావేశం జరగనుంది. 40ఏళ్ల తర్వాత ఒకే వేదికపై పంచపీఠాధిపతులు చేరనున్నారు. రంభాపురి పీఠం, ఉజ్జయిని పీఠం, కేదారపీఠం, కాశీపీఠం, శ్రీశైల పీఠాల స్వామీజీలు పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా 500మందికిపైగా మఠాధిపతులు భాగస్వాములు అవుతున్నారు. 1967లో ముక్తిమందిరంలో పంచపీఠాల స్వామీజీలు ఒకే వేదికపై సమావేశమయ్యారు. రాష్ట్రంలో బలప్రదర్శనకు వీరశైవలింగాయత సమాజం సిద్ధమైంది. కులగణన సమీక్ష ద్వారా ముస్లిం జనాభా పెరిగిందనే సమాచారం తెలిసిందే. రాష్ట్రప్రభుత్వం కులగణన, కేంద్రప్రభుత్వం జనాభా లెక్కలతోపాటు వచ్చే ఏడాది కులగణన చేపట్టాలని నిర్ణయించిన తరుణంలో వీరశైవలింగాయతలంతా అదే పేరు నమోదు చేయాలని మహాసభలో తీర్మానించనున్నారు. వీరశైవ లింగాయత మఠాలన్నింటి స్వామీజీలు ప్రాంతాలవారిగా ప్రచారం చేయనున్నారు. దావణగెరె జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రెండురోజులపాటు దావణగెరె రేణుకామందిరంలో జరిగే పీఠాధిపతి, శివాచార్యుల సభకు 25వేలమంది పాల్గొనవచ్చన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

పీఠాధిపతికి చెక్..!

● స్వామీజీకి వ్యతిరేకంగా మారిన ట్రస్టు


బసవ మృత్యుంజయస్వామీజీ

బెంగళూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): పంచమసాలి పీఠాధిపతికి, ట్రస్టు సభ్యుల మధ్య వివాదం తారస్థాయికి చేరింది. పంచమశీల పీఠాన్ని రాజకీయాలతో ముడిపెట్టి ధార్మిక, సేవా కార్యక్రమాలకు దూరం చేశారని జయమృత్యుంజయ స్వామీజీపై ట్రస్టు అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. స్వామీజీని పీఠం నుంచి తొలగించేందుకు కసరత్తు జోరందుకుంది. పంచమసాలి పీఠం బసవ తత్వాల ప్రచారం కోసం ఏర్పడిన మఠం. 2008లో బసవమృత్యుంజయస్వామీజీ పీఠాధిపతిగా నియమితులయ్యారు. ఇటీవల కొన్నేళ్లుగా స్వామీజీపై సమాజానికి చెందినవారే అసంతృప్తితో ఉన్నారు. స్వామీజీ మఠానికి దూరంగా ఉంటూ ధర్మప్రచారం కంటే రాజకీయాలవైపు ఎక్కువ దృష్టి సారించినట్టు ఆరోపణలు ఉన్నాయి. అఖిలభారత లింగాయత పంచమసాలి ట్రస్టు అధ్యక్షుడు, ఎమ్మెల్యే విజయానంద కాశప్పనవర్ తెలిపిన మేరకు ఈ ఏడాది పీఠానికి స్వామీజీ కేవలం రెండుసార్లు మాత్రమే వచ్చారన్నారు. ధర్మప్రచారం వీడి రాజకీయ పార్టీలతో ఎక్కువ సమయం గడుపుతున్నారన్నారు. బెంగళూరు, హుబ్బళ్ళి, బెళగావిలలో గడుపుతున్నారన్నారు. మఠంలో ఎక్కువకాలం స్వామీజీ లేనందున చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగాయన్నారు. బసవ తత్వ బోధనలు వీడి స్వామీజీ రాజకీయ పార్టీలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ట్రస్టు ముఖ్యులు త్వరలోనే ప్రత్యామ్నాయ వ్యవస్థకు నిర్ణయం తీసుకుంటారన్నారు. మఠానికి స్వామీజీగా ఉండవచ్చునని, అది అతడి సొంతం కాదన్నారు. కొత్తగా స్వామీజీని నియమించే ఆలోచన చేస్తున్నామన్నారు. కాగా జయమృత్యుంజయ స్వామీజీ కొత్త మఠాన్ని స్థాపిస్తానని ప్రకటించడాన్ని తాము వ్యతిరేకించేది లేదన్నారు. ట్రస్టుకు చెందిన కొందరు స్వామిజీ ముందుగానే పీఠం వీడితే మంచిదని, ఆ తర్వాత తొలగిస్తే చెడ్డపేరు వస్తుందన్నారు. మరోవైపు స్వామీజీ అకస్మికంగా ఆసుపత్రిలో చేరడం కేవలం ఓ నాటకమని పలువురు అభిప్రాయపడ్డారు. బసవ మృత్యుంజయ స్వామీజీ వీరశైవులకు బీసీ ఏ రిజర్వేషన్ కోసం నిరంతరంగా పోరాటాలు చేస్తున్న విషయం తెలిసిందే.

అక్షర యోగాకు గిన్నిస్ రికార్డులు సంతోషకరం

● పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామీజీ


విశ్వప్రసన్న తీర్థ స్వామీజీకి సత్కారం

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేశ పారంపర్య జ్ఞానంగా ఉన్న యోగా విశ్వమంతటా వ్యాపించిందని ఒకే రోజున అక్షరయోగా కేంద్రానికి 12 గిన్నిస్ రికార్డులు దక్కడం సంతోషకరమని పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామీజీ అన్నారు. అక్షరయోగా కేంద్రంలో ఆదివారం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్రం ముఖ్యులు హిమాలయన్ సిద్ధ అక్షర్ మాట్లాడుతూ యోగా మానవజాతికి ఓ మహత్తరమైన శక్తినిచ్చేలాంటిదన్నారు. యోగా, అవయవాల సాధనల ద్వారా ఆత్మపరివర్తనకు దారి ఇస్తుందన్నారు. 70 ఏళ్ల సుదీర్ఘకాలంలో సాధ్యంకానిది ఒకేసారి 12 గిన్నిస్‌రికార్డులు దక్కాయన్నారు. మన రుషులు, గురువులు శాస్త్రాలకు వాటిని అర్పిస్తున్నామన్నారు. యోగాను ఒలింపిక్స్‌కు తీసుకురావాలనేది ఆలోచన అన్నారు.

గిన్నిస్ రికార్డులు ఇలా...

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 550మంది భద్రాసనం, 864మంది అధోముఖ శ్వానాసనం, 539 మంది శలభాసనం, 522మంది గరుడాసన, 461 మంది ఉభయపదాంగుష్టాసన, 514 మంది ఏకపాద పదాముష్టాసన చేశారు. 1692 మంది సేతుబంధ సర్వాంగాసన, 1633 మంది సర్వాంగాసన, 1634 మంది వీరభద్రాసన, 1695 మంది ఉత్కటాసన, 863 మంది ఏకపాద రాజకపోతాసన, 529 మంది వీరభద్రాసన చేశారని వీటన్నింటికీ గిన్నిస్ రికార్డులు దక్కాయన్నారు. బేలిమఠాధిపతి శివరుద్రస్వామీజీ మాట్లాడుతూ యోగా విశ్వవ్యాప్తమైందని అయితే శతాబ్దాలుగా మన పూర్వీకులు యోగాను పాటించారన్నారు. నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్, మల్లేశ్వరం ఎమ్మెల్యే డాక్టర్ సీఎన్ అశ్వత్థ నారాయణ, సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ జోస్ మోహన్ పాల్గొన్నారు.

కేఆర్ఎస్ బ్యాక్ వాటర్‌లో ముగ్గురు నర్సింగ్ విద్యార్థుల గల్లంతు


గల్లంతైన విద్యార్థులు (ఫైల్)

బెంగళూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మైసూరు తాలూకా మీనాక్షిపుర సమీపాన కృష్ణరాజసాగర్ (కేఆర్ఎస్) డ్యాం బ్యాక్ వాటర్‌లో మండ్య మెడికల్ కళాశాల అనుబంధ నర్సింగ్ కాలేజీకి చెందిన ముగ్గురు విద్యార్థులు ఆదివారం గల్లంతయ్యారు. నర్సింగ్ విద్యార్థులు ప్రశాంత్, సిద్దేశ్, కృష్ణతోపాటు మరో ముగ్గురు సరదాగా కేఆర్ఎస్ బ్యాక్‌వాటర్ ప్రాంతానికి వెళ్లారు. ముందుగా నీటిలోకి దిగిన ఓ విద్యార్థి ఒక్కసారిగా లోపలికి కూరుకుపోయాడు. అతడిని రక్షించేందుకు మరో ఇద్దరు దిగారు. ముగ్గురూ నీట మునిగారు. గట్టున ఉండే మరో ముగ్గురు విద్యార్థులు వారిని రక్షించేందుకు కేకలు పెట్టారు. స్థానికులు వచ్చి గల్లంతైన ముగ్గురి కోసం గాలింపు చేపట్టారు. ఇలవాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపకశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని, గాలింపు చర్యలు చేపడుతున్నారు.


రక్షణ గోడ లేని రాజకాలువ

డేంజర్ యమ డేంజర్..

బెంగళూరులో చిన్నపాటి గుంత ఉంటేనే ప్రమాదాలు జరుగుతాయి. అటువంటిది మెయిన్‌రోడ్డు నుంచి మలుపుతిరిగే ప్రాంతంలో కాలువకు రక్షణ గోడ లేకుండానే నిర్మాణాలు జరిపిన ఘనత బీబీఎంపీ వారికే చెల్లింది. మల్లతహళ్ళి ప్రాంతం ఎన్‌జీఈఎఫ్ లే అవుట్ నుంచి కెంగుంటె సర్కిల్‌కు వెళ్లే మార్గంలో ద్విచక్రవాహనాలు వెళ్లాలంటేనే హడలెత్తే పరిస్థితి ఉంది. మలుపుగా ఉండే సర్కిల్‌కు అనుబంధంగానే రాజకాలువ ఉంది. రోడ్డు మలుపు ఉన్న చోట రక్షణ గోడ లేకుండా అడ్డదిడ్డంగా నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే పలువురు వాహనాలు నియంత్రించలేక కాలువలో పడిన సందర్భాలు ఉన్నాయి. రోడ్లంటే ప్రగతికి మార్గదర్శకాలు కావాలిగానీ ప్రమాదాలకు సంకేతాలు కారాదు. రక్షణ గోడ నిర్మించకపోతే ఆందోళన చేపడతామని స్థానికులు అధికారులను హెచ్చరిస్తున్నారు. (బెంగళూరు, ఆంధ్రజ్యోతి)

మాజీ మంత్రి మెట్టు దిగారా..?

బళ్లారికి తిరిగొచ్చిన నాగేంద్ర

రోజంతా కలియతిరిగిన

వైనం..

4





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.03	1621.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	38,079	1,07,198
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	39,009	1,267
నీటి నిల్వ (టీఎంసీలు)	79.90	65.11

రక్తదాన శిబిరం



రక్తదాతలకు సర్టిఫికెట్ అందిస్తున్న మాజీ మంత్రి నాగేంద్ర

బళ్లారిరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని మోకా రోడ్డు కేఆర్ఎస్ ఫంక్షన్ హాల్‌లో శ్రీరామరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని అధ్యక్షుడు శ్రీరామరాజు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీమంత్రి నాగేంద్ర, మేయర్ నందీశ్,తిమ్మనగౌడ, డీహెచ్‌వో రమేష్‌బాబు పాల్గొని రక్తదానం చేస్తున్న యువకులను అభినందించారు. శ్రీరామరాజు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారిని రక్షించినవారవుతారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు, యువకులు పాల్గొన్నారు.

అభయారణ్యం ఏర్పాటు చేయండి



పంపా విద్యాపీఠం వద్ద తిరుగుతున్న నెమళ్లు

కంప్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని బుక్క సాగర రామసాగరం గ్రామాల మధ్య నెమలి అభయారణ్యం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రెండు గ్రామాల మధ్య అడవుల్లో ఎక్కువగా నెమళ్లు కనిపిస్తున్నాయి. వాటికి సరైన ఆహారం రక్షణ లేక ఇబ్బందులకు గురవుతున్నాయి. వన్యప్రాణి అధికారులు అభయారణ్యం ఏర్పాటు చేస్తే పర్యాటకులకు తిలకించే కేంద్రం అవుతుంది. ప్రతినిత్యం ఉదయం సాయంత్రం వేళలో పంపా విద్యాపీఠం ప్రాంతాల్లో ఎక్కువగా నెమళ్లు కనిపిస్తున్నాయి.

శుద్ధజల ప్లాంట్ల పరిశీలన



శుద్ధ జల ప్లాంట్లను పరిశీలిస్తున్న సీఈఓ

రాయచూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు తాగునీరందించే పలు శుద్ధ జల ప్లాంటను జడ్పీ సీఈఓ ఈశ్వర్ కందూ ఆదివారం పరిశీలించారు. జిల్లాలోని లింగసుగూరు తాలూకాలోని చిత్తాపూర్, నరకలదిన్ని, ముదగల్ గ్రామాల వద్ద నిర్మిస్తున్న ప్లాంట్లను ఆయన పరిశీలించారు. వీటితో పాటు ముదగల్ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన శుద్ధీకరణ ప్లాంట్‌లను పరిశీలించి వాటి పనుల గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నారాయణపూర్ డ్యాం సమీపంలో జిల్లా తాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్న 160 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న శుద్ధీకరణ ప్లాంట్‌ను జడ్పీ సీఈఓ సందర్శించి పనుల పురోగతి గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

భూమిపూజ

సిరుగుప్ప, జూలై20 (ఆంధ్రజ్యోతి): నడివి గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో వాల్మీకి సముదాయ భవనం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు భూమిపూజ చేశారు. ఆదివారం గ్రామంలో భూమిపూజ చేసి పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు కరిబసప్ప, గ్యారెంటీ పథకాల అధ్యక్షుడు మారుతీ వరప్రసాదరెడ్డి, కౌన్సిలర్ గణేష్, గ్రామ పంచాయతీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



వాల్మీకి సముదాయ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

మాజీ మంత్రి మెట్టు దిగారా..?

- బళ్లారికి తిరిగొచ్చిన నాగేంద్ర
- అనుచరులకు పలకరింపులు



బళ్లారిలో ఒక కార్యక్రమంలో జనంతో మాట్లాడుతున్న నాగేంద్ర

బళ్లారి, జూలై 20(ఆంధ్రజ్యోతి): 'నాకు ఏ పాపం తెలీదు. అయినా ఎస్టీ శాఖ స్కాంలో నా మంత్రి పదవి పోయింది. నాకు మంత్రి పదవి ఇచ్చేంత వరకూ సొంత నియోజకవర్గానికి వెళ్లను' అని ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అధిష్టానంతో మాజీ మంత్రి బి. నాగేంద్ర భీష్మించారు. బళ్లారికి వస్తే గిస్తే మంత్రిగానే వస్తానని ఆయన తన అనుచరులు, సహచరులు, ఆప్తులతో అన్నారు. కానీ శనివారం బళ్లారికి వచ్చారు. ఇక నుంచి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. వాస్తవానికి నాగేంద్ర పట్టు వదలడం వెనుక ఉన్న భావన ఏమిటి? తనలో కోపం తగ్గి తప్పు ఏదో జరిగింది, ఇక నుంచైనా నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని అనుకున్నారా..? మంత్రి పదవి ఎప్పుడైనా రాని వచ్చేది వస్తుంది అనుకున్నారా.. ప్రస్తుతం కాంగ్రెస్‌లో మారుతున్న రాజకీయ పరిణామాలు అర్థం చేసుకుని ఒక మెట్టు దిగి వచ్చారా? అని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చసాగుతోంది. బళ్లారి అంటే చాలా మందికి గాలి జనార్ధన్‌రెడ్డి, బి. శ్రీరాములు, గాలి సోమశేఖర్‌రెడ్డి గుర్తుకు వస్తారు. అలాంటి కోటలో నాగేంద్ర బళ్లారి రూరల్ క్షేత్రం నుంచి పోటీచేసి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో తన స్థానం పటిష్టం చేసుకున్నారు. బి. శ్రీరాములుపై గెలిచారని అంతే కాకుండా ఎస్టీ నాయకుడిగా గుర్తించి కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు మంత్రి పదవి కట్టబెట్టింది. అయితే ఆయన ఎస్టీ నిగమ మండలిలో రూ.189 కోట్ల నిధులు స్వాహా చేసిన కేసులో ఇరుక్కున్నారు. ఎస్టీ సంక్షేమ శాఖకు మంత్రిగా ఉన్న నాగేంద్రను బాధ్యుడిని చేస్తూ మంత్రివర్గం నుంచి తప్పించారు. విచారణ, జైలు తరువాత ఆయనకు క్లీన్‌చిట్ వచ్చిందని తిరిగి మంత్రి పదవి ఇవ్వాలని పట్టుపట్టాడు. ఒకానొక దశలో సీఎం సిద్దరామయ్య కూడా తిరిగి మంత్రి పదవి ఇస్తామని అనేక సందర్భాల్లో బహిరంగంగానే చెప్పారు. మంత్రి పదవి కోసం నాగేంద్ర అనేకసార్లు రాష్ట్ర నాయకులతో పాటు కేంద్ర పెద్దలతోనూ కలిశారు. ఆయనకు మంత్రి పదవి వచ్చేస్తుంది అనే సమయంలో ఏదో ఒక రాజకీయ పరిణామాలు జరుగుతున్నాయని ఆయన వర్గీలు అంటున్నారు. నెల రోజుల క్రితం కూడా కాంగ్రెస్‌లో మంత్రివర్గం విస్తరణ జరిగే అవకావం ఉంది. ఈసారి ఖచ్చితంగా మంత్రి పదవితో వస్తారు అని ఆయన అనుయాయులు భావించారు. ఈసారి కూడా వారి ఆశలు ఎండమావే అయ్యాయి. ఇక రాజకీయ ప్రత్యర్థి అయిన బీజేపీ నాయకులు కూడా మాటలకు పదును పెట్టారు. గెలిపించిన క్షేత్ర ప్రజలను వదిలి పదవికోసం ప్రజలను మరిచిపోతున్నారని విమర్శలు పెంచారు. ఈ మధ్యకాలంలో మాజీ మంత్రి బి. శ్రీరాములు కూడా రెండు మూడు ప్రెస్‌మీట్‌లో ఆయననే టార్గెట్ చూస్తూ రాజకీయంగా విమర్శలు గుప్పించారు. ఇక నియోజకవర్గంలో నాగేంద్ర అనుచరులు, ఎన్నికల్లో ఆయన గెలుపునకు శ్రమించిన నాయకులు కూడా మంత్రి పదవి వస్తే వస్తుంది.. ముందు నియోజకవర్గానికి రావాలి అని నచ్చజెప్పినట్లు తెలిసింది. ఎట్టకేలకు నాగేంద్ర శనివారం బళ్లారిలో అడుగు పెట్టి అప్తులు, అనుచరులు ఇళ్లకు వెళ్లి పలకరిస్తున్నారు. నియోజకవర్గంలో రోజంతా తిరుగుతూ ఉన్నారు. ఇప్పుడు అన్నొచ్చాడు.. అని ఆయన అభిమానులు కూడా హుషారుగా ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఫిర్యాదిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేంద్ర

బళ్లారి సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల నుంచి తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు మాజీ మంత్రి బీ నాగేంద్రకు విన్నవించారు. నగరంలోని నాగేంద్ర కార్యాలయానికి వందలాది మంది తరలివచ్చారు. సమస్యలు విన్నవెంటనే అనేక సమస్యలను మాజీ మంత్రి అక్కడిక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వందలాది మంది ప్రజలు తాగు నీటి సరఫరా, ఆలయ గోపుర నిర్మాణానికి ఆర్థిక సహాయం, సీసీ రోడ్డు నిర్మాణానికి నిధుల విడుదల, వివిధ పాఠశాలల ఎస్‌డీఎస్‌సీ ఆఫీస్ బేరర్లు తమ పాఠశాలలకు అవసరమైన సౌకర్యాల గురించి వినతులు సమర్పించారు. పిల్లలవిద్య, ఫిట్‌నెస్, శస్త్రచికిత్స కోసం సహాయం కోరుతూ వినవితులు అందించారు. మాజీ మంత్రి వారికి ఆర్థిక సహాయం అందించారు. కొన్ని సమస్యల పరిష్కారం గురించి ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసి వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు.

పేద రైతులతో రెవెన్యూ అధికారుల చెలగాటం తగదు

- సామాజిక పరివర్తన సంఘం నాయకుడు ఎస్ఆర్ హిరేమత్



మొక్కనాటి నీరుపోస్తున్న హిరేమత్, కేఆర్ఎస్ పార్టీ దీపక్, కృష్ణారెడ్డి

బళ్లారి సిటీ,జూలై 20(ఆంధ్రజ్యోతి): పేద రైతుల జీవితాలతో రెవెన్యూ అధికారులు చెలగాటం ఆడుతున్నారని సామాజిక పరివర్తన సంఘం నాయకుడు ఎస్ఆర్ హిరేమత్ అన్నారు. సండూర్ తాలూకాలోని రామ్‌గడ్, కమ్మతూరు, జైసింగాపూర్, సిద్దాపూర్, సుశీల్‌నగర్, నరసింగాపూర్, భుజంగాపూర్, నందిహళ్ళి గ్రామాలు ఇతర గని ప్రభావిత ప్రాంతాలను సందర్శించి స్థానికులతో చర్చించి వారి సమస్యలను అడిగి ఆయన తెలుసుకున్నారు. సుశీలానగర్ గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ గ్రామం చుట్టూ కొత్త మైనింగ్ కంపెనీలు ప్రారంభం కావడంతో అధిక దుమ్ము, ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నామన్నారు. రెవెన్యూ అధికారులు అనేక సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్న రైతుల భూములను రికార్డులలో సారవంతం లేవిగా నమోదు చేయడంతో తీవ్రంగా నష్టపోయామన్నారు. నరసింగపుర గ్రామంలోని ప్రధాన రహదారిపై ఖనిజ ట్రక్కులు నిరంతర తిరుగుతుండటంతో ప్రజలు, పశువులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయన్నారు. ట్రక్కుల కోసం ప్రత్యేక బైపాస్ రోడ్డు నిర్మించాలని ఆయన కోరారు. భుజంగ నగర్ గ్రామంలో ఆర్టీసీ బస్సులు లేకపోవడం వల్ల పాఠశాలలు,కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, రవాణా శాఖ నుంచి అదనపు బస్సులు సకాలంలో నడపాలని విజ్ఞప్తి చేశారు. కమ్మతూరు గ్రామం చుట్టూ మితిమీరిన మైనింగ్ కారణంగా ట్రక్కులు, పేలుడు శబ్దాలతో ప్రజల జీవితాలు అస్తవ్యస్తంగా మారాయన్నారు. కార్యక్రమంలో కేఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దీపక్, జన సంగ్రామ్ పరిషత్ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి శ్రీశైల హాల్దల్లి, రైతు సంఘం అధ్యక్షుడు కే.నాయుడు పాల్గొన్నారు.

తీరనున్న పావగడ వాసుల దశాబ్దాల కల..!

- తుంగభద్ర జలాలతో తాగునీటి సమస్య పరిష్కారం
- నేడు సీఎం చేతుల మీదుగా ఇంటింటికి గంగ విడుదల
- హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



తుంగభద్ర నీటిని శుద్ధి చేస్తున్న యంత్రాలు

పావగడ, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఫ్లోరైడ్ రహిత నీటితో దాహం తీర్చుకోవాలన్న పావగడ ప్రజల మూడు దశాబ్దాల కల నెరవేరనుంది. సీఎం సిద్దరామయ్య చేతులమీదుగా సోమవారం తుంగభద్ర నీరు ఇంటింటికి గంగ పేరుతో ప్రారంభించనున్నారు. అలాగే దివ్యాంగులు, పట్టు రైతులకు, కార్మిక వ్యవసాయశాఖ రైతు సంజీవిని పథకాల కింద లబ్ధిదారులకు నష్టపరిహారం అందించే కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు.

ఎనిమిదేళ్ల కృషితో తాగునీరు

2017లో అప్పటి ముఖ్యమంత్రి సిద్దరామయ్య పలు స్వచ్ఛంద, సేవా సంస్థలు, రైతులు పాదయాత్ర చేపట్టి ఫ్లోరైడ్ రహిత నీటిని అందించాలని ధర్నా చేశారు. ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితం ద్వారా తాగునీటిని అందించేందుకు ముఖ్యమంత్రి ఒప్పుకున్నారు. తుంగభద్ర డ్యాం నుంచి 230కి.మి. పావగడకు కూడ్లగి, మొలకాల్మూరు, చళ్లికెర మీదగా పావగడకు నీటిని తరలించేందుకు ఎనిమిది సంవత్సరాలు పట్టింది. ఇంజనీర్లు, ప్రముఖ అధికారుల ద్వారా నీటిని తరలించేందుకు అనేక ప్రయత్నాలతో సోమవారం పావగడకు శుద్ధ జలం రానుంది.

ఎస్పీ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు

ముఖ్యమంత్రి సిద్దరామయ్య పావగడకు రానున్న సందర్భంగా తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో 2వేల మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సభకు ఆటంకాలు ఎదురుకాకుండా ఎక్కడికక్కడ వాహనాలు, జనం రద్దీకాక కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఉదయం 11-30కు సిద్దరామయ్య పావగడకు రానున్నారు. తుంగభద్ర నీటి ట్యాంకును ప్రారంభోత్సవం చేసి అనంతరం సభలో పాల్గొంటారు. 2 గంటలకు సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లను ప్రారంభిస్తారు. అనంతరం వెనుతిరిగి వెళ్తారని తెలిసింది.



మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

బళ్లారి సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా మరోప్రాణాన్ని కాపాడగలరని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు అన్నారు. జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ, ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ సహకారంతో స్వామి వివేకానంద బ్లడ్ బ్యాంక్ కౌల్‌బజార్ ప్రాథమిక ఆరోగ్య వైద్యశాల నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని ఆయన మాట్లాడారు. 18 నుంచి 60 సవత్సరాలు వయస్సున్న ఆరోగ్యవంతులైన వారందరూ రక్తదానం చేయవచ్చన్నారు. శ్రీరామ్ రాజ్ ఫౌండేషన్ ద్వారా ప్రతి రక్తదాతకుఉచిత హెల్మెట్లను పింపిణీ చేశారు. అనంతరం కౌల్‌బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా 105 మంది అవయవదానం కోసం నమోదు చేసుకున్నారు. శిబిరంలో 270 మంది రక్తదానం చేశారు. మహానగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ డి.సుకుమ్, అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహమూర్తి, సిబ్బంది సునీత, అరుణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక బాధ్యత హైకమాండ్‌దే..!

- బీజేపీ సీనియర్ నాయకుడు బీవై విజయేంద్ర



మాట్లాడుతున్న బీవై విజయేంద్ర

రాయచూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎవరిని ఎంపిక చేయాలన్నది హైకమాండ్ నిర్ణయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర అన్నారు. జిల్లాలోని లింగసుగూరు పర్యటనకు వచ్చిన ఆయన ఆదివారం ఎమ్మెల్యే మానప్ప వజ్జల్ నివాసంలో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పార్టీలో రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక విషయం హైకమాండ్ ఇప్పటికే దృష్టి సారించిందన్నారు. పార్టీని రాష్ట్రంలో సమర్థవంతంగా నడిపే వారికే అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తుందన్నారు. ఈ విషయంలో స్థానిక నాయకుల ప్రమేయం ఏమీ ఉండదన్నారు. కూడల సంగమ గురుపీఠ వ్యవహారానికి సంబంధించి అడిగిన ప్రశ్నకు మురుగేశ్ నిరాని దృష్టి సారించారని త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.

డాక్టర్ బదిలీని వెంటనే రద్దు చేయాలి



తహసీల్దార్ గౌసియాబేగమ్‌కు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘం పదాధికారులు

సిరుగుప్ప, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రి వైద్యుడు ప్రశాంత్‌కుమార్ బదిలీని రద్దు చేయాలని దళిత సంఘం కన్వీనర్ గంగప్ప ప్రభుత్వాన్ని కోరారు. సిరుగుప్ప పట్టణం వంద పడకల ఆస్పత్రిలో గైనిక్ నిపుణుడు ప్రశాంత్‌కుమార్‌ను ప్రభుత్వం వేరే ప్రాంతానికి బదిలీ చేసింది. ఆ బదిలీను నిరసిస్తూ దళిత నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ గౌసియాబేగమ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వాస్పత్రిలో మహిళల ప్రసవాలకు సంబంధించిన వైద్యులను బదిలీ చేయడంతో ఆపరేషన్లు చేసేవారు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్న ఒక స్త్రీ నిపుణులను వేరే ప్రాంతానికి బదిలీ చేయడం ఆపాలన్నారు. రఫీక్, వీరేష్, మల్లికార్జున, మారేష పాల్గొన్నారు.

యువకులపై కేసు నమోదు

బళ్లారి సిటీ,జూలై 20(ఆంధ్రజ్యోతి): నరగరంలో బైక్ నడుపుతూ బహిరంగంగా అనుచితంగా ప్రవర్తించిన ఇద్దరు యువకులు, వెనుక కూర్చని బీరు తాగుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ట్రాఫిక్ పోలీసులు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బైక్ వెనుక కూర్చున్న వ్యక్తితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కర్చేడ్ గ్రామానికి చెందిన కేశవ(23) అనే యువకుడు, అతిని స్నేహితుడు గత డిసెంబర్‌లో ఇలాంటి ప్రవర్తన చేశారని పోలీసులు తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు



అరెస్టయిన దొంగలు వీరే..

కంప్లి, జూలై20(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలుకా పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణంలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారు హొస్పేట తాలుకాలోని కొండనాయకనహళ్లి గ్రామానికి చెందిన మహేష్ (35), ప్రభాకర్ (28)గా గుర్తించారు. శనివారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చి ప్రశ్నించారు. వారిని విచారించగా ఇంట్లో దొంగతనం జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇక్కడి కంప్లి రోడ్డులోని పెట్రోల్ పంపు ఎదురుగా రోడ్డు పక్కన అద్దె ఇంట్లో నివసిస్తున్నట్లు తెలిసింది. మార్చిలో కురుగోడు పట్టణంలోని ముష్టిగట్టె రోడ్డులో ఉన్న ఉపాధ్యాయుడు విరుపాక్షప్ప ఇంట్లో 55 గ్రాముల బంగారు, రూ.3 లక్షల నగదు, బాదనట్టి గ్రామంలోని గురల్లి పద్మావతి ఇంట్లో 66 గ్రాముల బంగారు, రూ.6 లక్షలు విలువైన 190 గ్రాముల వెండి దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన నగల దొంగతనం కేసులో ప్రమేయం ఉందన్నారు. నగరంలోని సంగనకల్లు రోడ్డులో ఒక ఇంట్లో గంగావతి తాలుకాలోని వడ్రహట్టి గ్రామంలోని ఒక ఇంట్లో దొంగతనం జరిగినట్లు కూడా వెలుగులోకి వచ్చింది. 86 గ్రాముల బంగారు, 198 గ్రాముల వెండి, రెండు మొబైల్ ఫోన్లు, రూ.8 లక్షల విలువలైన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్న తరువాత దొంగలను జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. ఎస్పీ డాక్టర్ శోభారాణి, డీవైఎస్పీ ప్రసాద్ గోఖలే, సీపీఐ విశ్వనాథ్, కే హీరేగౌడ, పీఎస్ఐ సుప్రీత్ విరుపాక్షప్ప, సిబ్బంది విజయ్‌కుమార్, కే రాజశేఖర్, వినయ్, శివరాయప్ప, నవీన్, సురేష్ పాల్గొన్నారు.

ఇద్దరు చైన్‌స్నాచర్లు..



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

బళ్లారిరూరల్, జూలై20(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకా తోరణగల్లులో ఇద్దరు చైన్‌స్నాచర్లను అరెస్టు చేసినట్లు పొనగల్లు సీఐ మహేష్‌గౌడ, ఎస్ఐ నాగేశ్ తెలిపారు. తోరణగల్లు బండిహట్, చెక్‌పోస్టు సమీపంలోని ఉలిగమ్మ దుకాణంలో 15వ తేదీన ఓ మహిళ మెడలో చైన్‌ను లాక్కెళ్లారు. బాధితురాలు తోరణగల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ, ఎస్‌లు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టగా శనివారం రాత్రి బళ్లారి గుడార్ నగర్‌కు చెందిన మారెప్ప, శంకర్ అనే వ్యక్తులను గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

హోసూరు జోన్

హిందువులకు అండగా శ్రీరామసేన

- నూతన పదాధికారులు

హోసూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హిందువులకు ఎప్పుడూ శ్రీరామసేన అండగా నిలుస్తుందని శ్రీరామసేన సంస్థాపకులు ప్రమోద్ ముతాలిక్ పేర్కొన్నారు. హోసూరు కామరాజ్ కాలనీలోని ఆంధ్రసమితిలో శ్రీరామసేన మహాసభ నూతన పదాధికారులు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి ముతాలిక్ అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షుడు తారకప్రభు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాస్టర్ చంద్రు ముఖ్యులుగా పాల్గొన్నారు. ప్రమోద్ ముతాలిక్ మాట్లాడుతూ తమిళనాడులో జిహాద్, మతమార్పిడి జరుగుతున్నాయని, క్రైస్తవులు నిరంతరం గ్రామాలకు వెళ్లి వారివైపు ఆకర్షించేలా క్రైస్తవమతంలో చేరేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. ముస్లింలు జిహాద్ ద్వారా ఉగ్రవాదులను పెంచుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మతద్రోహులను, దేవాలయాలపై దాడి చేసేవారిని శ్రీరామసేన అడ్డుకునేందుకు ప్రయత్నిస్తారన్నారు. మేం రాజకీయాలు చేయమని, కేవలం హిందూ ధర్మానికి వ్యతిరేకంగా వెళ్లేవారిని మాత్రమే అడ్డుకుంటామన్నారు. ఈ విషయంలో మేం దీన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రైస్తవుల పాఠశాలల్లో కుంకుమ, విభూతి, పువ్వుల వాడకాన్ని అడ్డుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలల ప్రవేశద్వారం వద్ద శ్రీరామసేన తరపున పూలు, కుంకు, కంణాలు ఉంచి నిరసన తెలియచేస్తామన్నారు. హిందువుల పాఠశాలల పిల్లలు పూలు, కుంకుమ, గాజులు ధరించమని అడుగుతామన్నారు. కాగా కొంత మంది ఓట్లకోసం హిందువులను అవమానించడం సరికాదన్నారు.



ప్రసంగిస్తున్న ప్రమోద్ ముతాలిక్

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ



వ్యర్థాలు సేకరించిన సభ్యులు

హోసూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): హోసూరు అటవీప్రాంతం, రోడ్డుపక్కన ఇతర ప్రాంతాలలో పడి ఉన్న 1,155 ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను సేకరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని కలుగుతోందని వీటికి అడ్డుకట్ట వేసేలా ప్రజలు సహకరించాలని అటవీశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. వన్యప్రాణి సంరక్షణాధికారి పహన్ జగదీశ్ ఆదేశాలతో అటవీశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సేవకులు, పాఠశాల విద్యార్థులు 520మందికిపైగా పాల్గొని భారీ ప్రమాణంలో వ్యర్థాలను సేకరించారు. హోసూరు - బెంగళూరు జాతీయ రహదారి, హొగనేకల్ రోడ్డు, తిరుపత్తూరు సేలం హైవే, కావేరి నార్త్, కావేరి సౌత్ వన్యప్రాణుల అభయారణ్యం తదితర ప్రాంతాలలో వ్యర్థాలను సేకరించారు. వాటిని చెత్త సంస్కరణ కేంద్రాలకు అప్పగించారు.

లయన్స్‌క్లబ్‌కు నూతన పదాధికారులు




సంఘం నూతన పదాధికారులు

హోసూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ హోసూరు ఫ్లవర్‌సిటీ సంఘానికి 2025-26 సంవత్సరానికి నూతన పదాధికారులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి బాధ్యతలు స్వీకరించారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు అన్నయ్యర్‌రెడ్డి నేతృత్వంలో కార్యవర్గం ఏర్పాటైంది. ఈ సందర్భంగా విద్యార్థులకు బెల్ట్‌లు, టైలు ఇతర వస్తువులు పంపిణీ చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఎర్నెస్ట్ హెమింగ్‌వే (జయంతి)



అమెరికా దేశానికి చెందిన నవలా రచయిత ఎర్నెస్ట్ మిల్లర్ హెమింగ్ వే 1899 జూలై 21న జన్మించారు. చిన్నకథల రచయిత, పాత్రికేయుడు, క్రీడా కారుడిగా రాణించారు. 1920 నుంచి 1950 మధ్య ఆయన రచనలు అమెరికన్ సాహిత్యంలో క్లాజిక్‌గా నిలిచాయి. 'ది సన్ ఆల్సో రైజెస్', 'ఏ ఫేర్‌వెల్ టు ఆర్మ్స్' నవల ఎంతగానో పేరొందాయి. పులిట్జర్ ప్రైజ్, నోబెల్ పురస్కారం అందుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఆయన ధైర్యసాహసాలకు బ్రాంజ్ స్టార్ గుర్తింపు పొందారు. 1961 జూలై 2న కన్నుమూశారు.

గంగూబాయి హానగల్ (వర్ధంతి)



పద్మవిభూషణ్ గ్రహీత గంగూబాయి హానగల్ 1913 మార్చి 5న కర్ణాటక రాష్ట్రం ధారవాడలో జన్మించారు. హిందూస్తానీ సంగీత కళాకారిణి. ప్రత్యేకించి కిరానా ఘరానాలోని ఖాయల్‌లో రాణించారు. దేశవ్యాప్తంగా కచేరీలలో పాల్గొని తన అద్భుతగ్రాతంతో సభికులను అలరించారు. ఆల్ ఇండియా రేడియో స్టేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కర్ణాటక యూనివర్సిటీ గౌరవ మ్యూజిక్ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, పద్మభూషణ్, పద్మవిభూషణ్ తదితర అవార్డులు అందుకున్నారు. 2009 జూలై 21న కన్నుమూశారు.

శివాజీ గణేశన్ (వర్ధంతి)



తమిళనాట 'నడిగర్ తిలగం'గా పేరొందిన శివాజీ గణేశన్ 1928 అక్టోబరు 1న విల్లుపురంలో జన్మించారు. నటుడు, నిర్మాతగా రాణించి తమిళ సినిమా రంగంలో తనదైన ముద్రను చాటారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకున్న తొలి నటుడు. ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్, నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్, తమిళనాడు స్టేట్ అవార్డ్స్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, కళైమామణి, పలు గౌరవ డాక్టరేట్‌లు, పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. చెన్నై, పుదుచ్చేరిలలో ఆయన విగ్రహాలు నెలకొల్పారు. 2001 జూలై 21న కన్నుమూశారు.



వేదికపై చిన్నారులతో ప్రముఖులు

బసవ తత్వాలు మరింత చేరువ కావాలి

బెంగళూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో బసవతత్వాలు మరింత చేరువ కావాలని సోమశేఖర స్వామిజీ అభిప్రాయపడ్డారు. నగరంలోని రవీంద్రకళాక్షేత్రలో విమాన కార్ఖానా సేవా సమితి ఆధ్వర్యంలో బసవసేవా రత్న పురస్కారం స్వీకరించి మాట్లాడారు. శతాబ్దాల క్రితమే సమసమాజం కోసం బసవణ్ణ పాటుపడ్డారని, ఆయన వచనాలు నేటికీ అనుసరణీ యమ న్నారు. ఈ సందర్భంగా చిన్నారులు బసవణ్ణ, అక్కమహాదేవి వేష.దారణలతో అలరించారు. కార్యక్రమంలో సమితికి చెందిన బేలూరప్ప, బీఆర్ వినయ్ బాబు, ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాటాలు: సీపీఐ

పెనుకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అని నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు అన్నారు. ఆదివారం స్థానిక ఎంక్యూయూ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మహాసభలను శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన పోరాటంచేసి ఎంతోమందికి కష్టాల నుంచి విముక్తి కల్పించిందన్నారు. ఈనెల 31, ఆగస్టు 1న ధర్మవరంలో జరిగే జిల్లాస్థాయి మహాసభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం నియోజకవర్గం, మండల స్థాయి కమిటీలను ఎన్నుకున్నారు. నియోజకవర్గం కమిటీ కార్యదర్శిగా శ్రీరాములు, మండల కార్యదర్శిగా నరసింహులు, సహాయకార్యదర్శి మల్లికార్జునతో పాటు పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చౌడేశ్వరి ఉత్సవాలకు ఆహ్వానం

సోమందేపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవానికి రావాలని తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు సీసీహరి మంత్రి సవితను ఆదివారం ఆహ్వానించారు. పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ప్రతిఏటా వైభవంగా ఉత్సవం జరుగుతుందని వివరించారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు: ఎస్ఐ

పరిగి, జూలై 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రంగడుయాదవ్ హెచ్చరించారు. ఊటకూరు పంచాయతీ పరిధిలోని చుట్టుపక్కల ప్రాంతాల రైతులు ఊటకూరు చెరువు నుంచి అనుమతిలేకుండా బంక మట్టిని పొలాలకు తరలిస్తుండగా పోలీసులు అడ్డగించారు. స్థానిక రైతు కిష్టప్ప మాట్లాడుతూ తమ సొంత పొలాలకుచెరువు నుంచి బంక మట్టిని తరలించుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేస్తే పోలీసులు ట్రాక్టర్లను అడ్డగించి అనుమతులు పొందిన తరువాతే తరలించుకోవాలని తెలుపడం జరిగిందన్నారు. ఈ విషయమై ఎస్ఐ రంగడుయాదవ్‌ను మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అనుమతులు పొంది రైతులు తమ పొలాలకు యథేచ్ఛగా బంకమట్టిని తరలించుకోవచ్చని సూచించారు.

విజయవంతం చేద్దాం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి

గుడిబండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి అనిత పర్యటనను విజయవంతం చేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని రాళ్లపల్లి శంకర్‌గల్లు గ్రామాల టీడీపీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం గుడిబండలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం జరుగుతుందని, కార్యక్రమానికి హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు.

జాబ్‌మేళాతో చేయూత

ముళబాగిలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలను ఆహ్వానించి భారీ ఉద్యోగమేళా ఏర్పాటు చేసినట్లు కోలారు ఎమ్మెల్యే కొత్తూరు జీ మంజునాథ్ తెలిపారు. పట్టణ శివారులోని పూల్‌చంద్‌జైన్ కల్యాణమండపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన మెగా జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడారు. జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దుగా ఉండడమే కాక ఎంతోమంది నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తొలుత మేళాను కోలారులో ఏర్పాటు చేయదలిచామని, అయితే ఇక్కడి కాంగ్రెస్ నాయకుడు వీ ఆదినారాయణ కోరిక మేరకు ముళబాగిలులో ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత మేళాలో ఎవరికైనా ఉద్యోగం లభించకపోతే నిరాశ చెందవద్దని, అర్హత, అవకాశం ఉన్నవారికి తప్పకుండా ఉద్యోగం లభిస్తుందని తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. తాను తొలుత ముళబాగిలు ఎమ్మెల్యేగా వ్యవహరించానని, తర్వాత కోలారు ఎమ్మెల్యే అయ్యానన్నారు. అయినా ముళబాగిలు సమగ్ర అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. పట్టణంలో యోజనా ప్రాధికార ఏర్పాటుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిపారు. ఆదినారాయణ చేపట్టిన సామాజిక సేవలు ప్రజాదరణ పొందాయని ప్రశంసనీయమన్నారు. నారాయణ మాట్లాడుతూ తాను చేపట్టిన ఉద్యోగమేళా రాజకీయాలకు సంబంధం లేదని, నిరుద్యోగులకు వీలుగా తాను వ్యక్తిగతంగా నిర్వహించినట్టు తెలిపారు. మేళాలో 6వేలమందికిపైగా పేర్లు నమోదు చేసుకున్నారు. అభ్యర్థులకు అల్పాహారం, కాఫీ, మధ్యాహ్న భోజనం వ్యవస్థ కల్పించారు. ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామకపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో లోక్‌సభ అభ్యర్థి కేవీ గౌతమ్‌గౌడ, సీనియర్ నాయకులు ఆలంగూరు శివణ్ణ, రామలింగారెడ్డి, కార్గిల్ వెంకటేశ్, అక్మల్‌బేగ్, గ్యారెంటీ అమలు సమితి తాలూకా అధ్యక్షుడు ఉమాశంకర్, నగరసభ మాజీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మంజునాథ్

సరళమైన రచనలకు పూర్ణచంద్ర తేజస్వి ప్రసిద్ధి

» డాక్టర్ రుద్రేశ్ అదరంగి



జ్యోతిప్రజ్వలనలో డాక్టర్ రుద్రేశ్ అదరంగి, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి తదితరులు

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సరళమైన రచనలు అన్నివర్గాలకు చేరువగా ఉంటాయని ఆ దిశగా పూర్ణచంద్రతేజస్వి పేరొందినవారని కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి అభిప్రాయపడ్డారు. పీఈఎస్ యూనివర్సిటీలో కర్ణాటక సాహిత్య అకాడమీ ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. అకాడమీ సభ్యులు సుమా సతీశ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా పీయూ విద్యార్థులను ఉద్దేశించి రుద్రేశ్ అదరంగి మాట్లాడుతూ కన్నడ జాతీయ కవి కువెంపు వారసుదారుడు పూర్ణచంద్ర తేజస్వి కూడా రచనలతో కన్నడ సాహిత్య పరంపరను కొనసాగించారన్నారు. పూర్ణచంద్ర రచించిన 'కృష్ణగౌడన ఆనె' అనే రచన గురించి వివరిస్తూ ప్రకృతి, మానవ సంఘర్షణల మధ్య కారణం మానవ నిర్మితాలే అనే విషయం స్పష్టమైందన్నారు. ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ భాషను పెంచడం అంటే భాషను ఉపయోగించడం అని కేవలం మార్కులకోసం కాకుండా భాషపై అభిమానంతో శ్రద్ధగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయండి

» కార్యకర్తలకు రామచంద్రగౌడ పిలుపు

శిడ్లఘట్ట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎటు చూసినా అవినీతి తాండవం చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేలా కార్యకర్తలు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని చిలకలనేర్పు హోబళికి విచ్చేసిన వేళ కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకలనేర్పు హోబళి శిడ్లఘట్ట నియోజకవర్గానికి దేవమూలలా ఉందన్నారు. ఇక్కడి ప్రజలు ఎవరికీ మెజారిటీ ఇస్తారో వారే గెలుపు సాధిస్తారనే విశ్వాసం ఉందన్నారు. దివంగత మాజీ హోం మంత్రి కృష్ణారెడ్డి చిలకలనేర్పు హోబళికి చెందినవారన్నారు. ఈ నియోజకవర్గంలో ఆయన చేసినసేవలు నేటికీ గుర్తింపు పొందాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిని ఎండగట్టాలని రానున్న జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ, గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని, ఎన్డీయే అభ్యర్థులు గెలుపొందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మునిరాజు, బీజేపీ శిడ్లఘట్ట రూరల్ అధ్యక్షుడు సీకల్ ఆనందగౌడ, మాజీ అధ్యక్షుడు సురేంద్రగౌడ, కెంచార్లహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మిట్టహళ్ళి మంజు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడకు ఘనస్వాగతం

విద్యార్థులను ప్రోత్సహించేలా సేవలు



విద్యార్థులకు ప్రత్యేక తరగతులలో ప్రముఖులు

బొమ్మనహళ్ళి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సమాజసేవలో ప్రత్యేకించి రేపటి పౌరులైన విద్యార్థులను ప్రోత్సహించేలా విజయాబ్యాంకు లే అవుట్‌కు చెందిన లుంబిని బుద్ధవిహార సర్వజన సేవాట్రస్టు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని కాంగ్రెస్ నాయకుడు అశ్వత్థ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. ఆరేళ్ల నుంచి దేవరచిక్కనహళ్ళి తదితర ప్రాంతాలలో పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, స్కూల్‌బ్యాగు, ఇతర రాత సామగ్రి అందచేస్తోందన్నారు. మెరిట్ విద్యార్థులను గుర్తించి ప్రోత్సహిస్తోందని ట్రస్టు అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. నిరాశ్రయులైన వృద్ధులను ఆశ్రమంలో చేర్పిస్తున్నామన్నారు. అంబేడ్కర్ ఆశయాలతో ట్రస్టును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బుద విహార్ నుంచి బౌద్ధభిక్షకులు వచ్చి తరగతులు నిర్వహిస్తారన్నారు. ప్రతి ఆదివారం విద్యార్థులతో ప్రార్థనలు చేయించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీంద్ర, వాసుదేవరెడ్డి, సంపంగి, సర్దార్, ట్రస్టు గౌరవాధ్యక్షులు సిద్ధాపుర మంజునాథ్, ప్రెసిడెంట్ వెంకటేశ్, వైస్ ప్రెసిడెంట్ జయకుమార్, గణపతిపుర మంజు, తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వచ్చి వెళ్తూ...

- ఎల్లెల్సీలోకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు యువకులు గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- గల్లంతైన యువకుడి కోసం గాలింపు
- మరో నలుగురిని కాపాడిన రైతు కూలీలు
- అతి వేగమే కారణమంటున్న స్థానికులు

ఆరుగురు యువకులు మంచి స్నేహితులు. కర్ణాటక రాష్ట్రం దార్వాడ జిల్లా హుబ్లీ దగ్గర ఓ కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శని, ఆదివారాలు సెలవుకావడంతో రాఘవేంద్రస్వామి దర్శించుకునేందుకు కారులో వచ్చారు. స్వామివారిని దర్శించుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. కొప్పల్ దగ్గర ఉన్న గవిమఠాన్ని సందర్శించుకోవాలని అనుకున్నారు. వారు వెళ్తున్న కారు అతివేగంగా కౌతాళం సమీపంలో ఎల్లెల్సీ కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు గల్లంతు అయ్యారు. కాగా వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో నలుగురు యువకులను కాలువగట్టుపై భోజనాలు చేస్తున్నరైతు కూలీలు సురక్షితంగా కాపాడారు. కాగా ప్రమాదానికి అతి వేగమే కారణమని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.



ఎల్లెల్సీ కాలువలో నుంచి ఎక్స్‌కవేటర్ సాయంతో కారును బయటకు తీస్తున్న దృశ్యం

కౌతాళం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చి వెళ్తూ ఓ కారు అతివేగంతో ఎల్లెల్సీలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు గల్లంతు కాగా ఒకరి మృతదేహం లభించింది. మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కారులో ఉన్న మిగతా నలుగురిని రైతు కూలీలు సురక్షితంగా కాపాడినట్లు కౌతాళం సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం దార్వాడ జిల్లా హుబ్లీలోని ఓ కంపెనీలో సునీల్, మణికంఠ, హైదర్, మంజునాథ్, అప్పయ్య, అభిషేక్ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరంతా 25ఏళ్లలోపు యువకులే. మంచి స్నేహితులు. శని, ఆదివారాలు సెలవులు రావడంతో మంత్రాలయానికి రాఘవేంద్రస్వామిని దర్శ నార్థం కారులో వచ్చారు. దర్శనం ముగించుకొని ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామానికి బయలుదేరారు. కొప్పల దగ్గర ఉన్న గవిమఠం క్షేత్రాన్ని దర్శించుకొని అక్కడి నుంచి హుబ్లీకి రాత్రికంతా చేరుకోవాలనుకున్నారు. అతివేగంతో కౌతాళానికి మూడు కిలోమీ టర్ల దూరంలోని ఎల్లెల్సీ కాలువలోకి కారు దూసుకెళ్లింది. మణికంఠ(20), సునీల్ (21) కాలువనీటిలో గల్లంతయ్యారు. సునీల్ మృతదేహం లభ్యమైంది. మణికంఠ ఆచూకీ కోసం చీకటి పడినా ఎస్డీఆర్‌ఎఫ్ రెస్క్యూ టీం, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగించారు. తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, మంత్రాలయం సీఐ రామాంజులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

కాలువ గట్టుపై భోజనాలు చేస్తుండగా...

కౌతాళం మండల టీడీపీ నాయకుడు వెంకటపతిరాజు పొలంలో పనుల కోసం వచ్చిన ఎరిగేరి, లక్ష్మీనగర్ క్యాంపులకు చెందిన రైతు కూలీలు గొట్టయ్య, గోవర్ధన్, రమేష్ ఆదివారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో ఎల్లెల్సీ కాలువ గట్టుపై భోజనాలు చేస్తున్నారు. ఆసమయంలో కుప్పగల్ నుంచి కౌతాళం వైపు వేగంగా వెళ్తున్న కారు కాలువలోకి దూసుకువెళ్లింది. గట్టుపై భోజనం చేస్తున్న కూలీలు క్షణాల్లో అప్రమత్తమయ్యారు. కాలువలో పడిన కారులోని యువకులను కాపాడేందుకు ముం దుకు వచ్చారు. హైదర్, మంజునాథ్, అప్పయ్య, అభిషేక్‌ను సురక్షితంగా కాపాడారు. వీరిలో ఇద్దరికి ఈత వస్తుండడంతో కారులో నుంచి అతికష్టంమీద బయటకు వ స్తుండగా కూలీలు వారిని ఒడ్డున చేర్చి ప్రాణాలను కాపాడారు. అప్పటికే ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. వారిని కాపాడలేకపోయామనే బాధ వేధిస్తుందని కూలీలు పేర్కొన్నారు.



గల్లంతైన వారి కోసం గాలిస్తున్న దృశ్యం

ఎక్స్‌కవేటర్ సాయంతో..

ఎల్లెల్సీలోకి కారు దూసుకుపోయిందనే సమాచారం తెలియగానే సీఐ అశోక్‌కుమార్, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. అప్పటికే కూలీలు నలుగురు యువకులను సురక్షితంగా కాపాడారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో కాలువలోని కారును బయటకు తీశారు. సునీల్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు మిత్రులను కోల్పోవడం ఎంతో బాధగా ఉందని, ఆ రాఘవేంద్రస్వామియే మమ్మల్ని కాపాడారని, ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడిన యువకులు పేర్కొన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వెజ్‌కు బదులు నాన్‌వెజ్ పిజ్జా డెలివరీ

» వినియోగదారుల ఫోరం అర లక్ష జరిమానా

బెంగళూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): డొమినోస్ పిజ్జా అంటే పేరొందిన సంస్థ. వెజిటబుల్ పిజ్జా ఆర్డర్ చేస్తే నాన్‌వెజ్ పిజ్జా డెలివరీ చేయడంతో మాంసాహార ప్రియులతో సంబరపడతారు. కానీ ధారవాడ నగరం విద్యాగిరి కాలనీకి చెందిన ప్రద్యుమ్న ఇనాందార్ తందూరి పన్నీర్ పిజ్జా, పన్నీర్ టిక్కా, స్టఫ్ గార్లిక్ బ్రెడ్, వెజ్ జింగీ ఆర్డర్ చేశాడు. అందుకు రూ.555 చెల్లించాడు. అయితే డొమినోస్ సిబ్బంది చికెన్ పిజ్జాను డెలివరీ చేశారు. వెజిటేరియన్ అయిన విద్యార్థి ప్రద్యుమ్న డొమినోస్ సంస్థపై వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. అందుకు సంస్థ ఆర్డర్ చేసిన పిజ్జా సొమ్ము వాపసుతోపాటు పరిహారంగా వెజ్ పిజ్జాను ఇస్తామని తెలిపింది. అయితే శాకాహారి అయిన నేను ఆకలితో ఉన్నప్పుడు పిజ్జాను ఆర్డర్ చేస్తే మాంసాహారం ఎలా పంపుతారని ప్రశ్నిస్తూ 2025 జనవరి 1న వినియోగదారుల ఫోరంకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి హిందూ ధార్మిక పద్ధతిలో ఒక వ్యక్తికి మానసికంగా ఇబ్బంది కలిగించినట్టుగా భావించి ఫోరం 50వేల రూపాయల జరిమానాతోపాటు అదనంగా ఖర్చులకు రూ.10వేలు చెల్లించేలా ధారవాడ జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు ఈశరప్పబూతా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

గురువులకు సన్మానం



గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

బాగేపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): విఘ్నేశ్వర హైస్కూల్ పూర్వ విద్యార్థులు స్నేహ మిలన, గురువందన కార్యక్రమం అర్థవంతంగా నిర్వహించారు. 1999-2000 బ్యాచ్ విద్యార్థులు తమ గురువులను ఆత్మీయంగా సత్కరించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నిజలింగ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తమకంటే ఉన్నత హోదాలలో వారి విద్యకు సార్థకత లభించినట్టేనన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత అందరూ మళ్లీ చేరుకుని తమ అనుభూతులు పంచుకున్నారు. తమ గురువులు గోపాలరెడ్డి, వినయ్‌కుమార్, శ్రీనాథ్‌లను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు శైలజా, వనజా, జయసుధ, శ్రీదేవి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కంటైనర్



బిదరగుప్పె చెరువుగట్టు వద్ద ఒరిగిన కంటైనర్

దొమ్మసంద్ర, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా అత్తిబెలె - సర్జాపుర మార్గంలో బిదరగుప్పె చెరువు కట్టపై నుంచి వస్తున్న కంటైనర్ అదుపు తప్పింది. దేవనహళ్ళి నుంచి సరిహద్దులోని హోసూరుకు ఇదే ప్రధానమార్గంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే చెరువుకట్టపై రోడ్డు చిన్నదిగా ఉండడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎదురెదురుగా భారీ వాహనాలు వస్తే ఒక్కోసారి గంటల తరబడి ట్రాఫిక్ నెలకొంటుంది. అదృష్టవశాత్తు కంటైనర్‌అదుపు తప్పినా భారీ ప్రమాదం చోటు చేసుకోలేదు. హర్యానా రిజిస్ట్రేషన్ కలిగిన కంటైనర్‌లో ప్రముఖ సంస్థ ద్విచక్రవాహనాలు ఉన్నట్టు తెలుస్తోంది. శనివారం అర్ధరాత్రి దాటాక క్రేన్ల సాయంతో కంటైనర్‌ను తొలగించినట్టు అత్తిబెలె పోలీసులు తెలిపారు.

16న ప్రతిభా పురస్కారాలు



సంఘానికి చెక్కు అందజేస్తున్న కృష్ణప్ప

చింతామణి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 2024-25లో ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలో అత్యధిక మార్కులు సాధించిన గాణిగ సముదాయ విద్యార్థులనుంచి ప్రతిభా పురస్కారాలకు అర్జీలు ఆహ్వానిస్తున్నట్టు తాలూకా గాణిగర క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు కురుటహళ్ళి కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు 16న కార్యక్రమం నిర్వహిస్తున్నా మని 10లోగా అర్జీలు సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 60శాతానికిపైగా ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు 80శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుందన్నారు. సంఘం ఆధ్వర్యంలో 14వ ప్రతిభా పురస్కారమన్నారు. ట్యాంక్‌బండ్ రోడ్డులోని శిల్పాస్కూల్ ఆవరణలో కార్య క్రమం చేపడుతున్నట్టు తెలిపారు. అంతకుముందు జరిగిన సమావేశంలో ఆర్సీబీ విజయోత్సవ తొక్కిసలాటలో మృతి చెందిన శ్రవణ్ జ్ఞాపకార్థం ఆయన తాత, తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు కురుటహళ్ళి కృష్ణప్ప రూ.25వేలు సంఘానికి విరాళంగా అందచేశారు. సమావేశంలో సంఘం కార్యదర్శి కేఎన్ నరసింహప్ప, కోశాధికారి ఆంజప్ప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.